సాక్షి
పల్నాడు

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్ : ఏపీ నర్సింగ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.10 అడుగుల వద్ద ఉంది.

వారంలో మూడు రోజులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ వైద్య విభాగంలో వారంలో మూడు రోజులు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు.

న్యూస్‌రీల్

గుంటూరు పార్లమెంట్ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డికి అదనంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం బాధ్యతలను అప్పజెప్పారు. ఈమేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇకపై గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి వ్యవహరిస్తారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 18 ఫిర్యాదులు



నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి చేపట్టిన డయల్ యువరు కలెక్టర్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుంది. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల నడుమ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లుగా నమోదు, తొలగింపు, బదిలీలకు సంబంధించి సుమారు 18 మంది ఫోన్‌చేసి వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన వసంతరాయుడు



గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా ఎన్వీబీఎస్ వసంతరాయుడు బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన జె.మోహన్‌రావు డిప్యూటీ సీఈవోగా కొనసాగనున్నారు.

పులిచింతల ప్రత్యేక కలెక్టర్‌గా సుబ్బారావు

నరసరావుపేట: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలవరం ప్రత్యేక కలెక్టర్‌గా పనిచేస్తున్న వరద సుబ్బారావు పులిచింతల ప్రత్యేక కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న వల్లభనేని శ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లాకు డీఆర్వోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన బదిలీల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పి.వి.ఎస్ సూర్యనారాయణ మూర్తి బుధవారం తెలిపారు. అదాలత్ లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగరంగ వైభవంగా త్యాగరాజస్వామి నగరోత్సవం

పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 177వ సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముగింపులో భాగంగా త్యాగరాజస్వామి కళావేదికగా బుధవారం ఉదయం త్యాగరాజస్వామికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మేళతాళాలతో త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపిస్తూ జరిగిన నగరోత్సవంలో కళాకారులు, ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక రణభేరి

- సామాజిక సాధికార బస్సుయాత్రకు వెల్లువెత్తిన ప్రజలు
- ఒకటిన్నర కి.మీ.నడిచేందుకు గంటన్నర సమయం
- చంద్రబాబు బీసీ అభ్యర్థిని తొలగించి తన కొడుక్కి టికెట్ ఇచ్చుకుంటే, బీసీ వర్గాలకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరిలో సాధికారతను నలుదిశలా చాటిన సామాజిక బస్సు యాత్ర



ప్రసంగిస్తున్న గంజి చిరంజీవి, వేదికపై మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ హనుమంతరావు, జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కాండ్రు కమల తదితరులు

తాడేపల్లిరూరల్: నియోజకవర్గంలో అన్ని దారులు మంగళగిరి వైపే సాగాయి. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన సామాజిక నినాదానికి మంగళగిరి ప్రజలు జైకొట్టారు. మంగళగిరి సీటును ఏకంగా బీసీలకు కేటాయించడంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం ఉరకలేసింది. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్త బస్టాండ్ నుంచి మిద్దె సెంటర్ వరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. బస్సుయాత్ర ప్రారంభమయ్యే సమయంలో అక్కడకు చేరుకున్న ప్రజలు కోలాహలంగా డ్యాన్స్‌లు చేస్తూ జయహో సామాజిక సాధికార యాత్ర అంటూ నినాదాలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలంటూ నినాదాలు చేశారు. డీజే సౌండ్‌లు, బాణసంచా మోతతో మంగళగిరి మార్మోగింది. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు జింకా విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పట్టణంలో బుల్లెట్లతో ర్యాలీ నిర్వహించారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నాయకుల ఫొటోలతో కూడిన ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఒకటిన్నర కిలోమీటర్లు నడవడానికి గంటన్నర సమయం పట్టిందంటే బస్సు యాత్రను ఏ విధంగా విజయవంతం చేశారో అర్థం అవుతుంది.

బలహీనవర్గాలకు సీటు ఇచ్చిన ముఖ్యమంత్రి : మంగళగిరి సమన్వయ కర్త గంజి చిరంజీవి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ సమాజ నిర్మాణం కోసం ఎంతో కృషి చేస్తున్నారని, దానిలో భాగంగా మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని నిర్ణయించారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీసీ అభ్యర్థినైన తనను తొలగించిన చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. మంగళగిరి ప్రజలు దానిని తిరస్కరించి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. దీనిని బట్టి మంగళగిరి ప్రజలు సమసమాజ నిర్మాణం ఎవరు చేస్తున్నారు? పెత్తందారీ విధానాన్ని ఎవరు అమలు చేస్తున్నారనే విషయాలను గమనించుకోవాలని అన్నారు. మంగళగిరిలో పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని, గతంలో ఎన్నడూ చేయని విధంగా అభివృద్ధి మంగళగిరిలో జరిగిందన్నారు.

సాధికార యాత్ర సాగింది ఇలా..

సామాజిక సాధికార యాత్ర సందర్భంగా మంగళగిరి ఉదయం నుంచి కోలాహలంగా మారింది. గౌతమ్ బుద్ధ రోడ్‌లోని కొత్త బస్టాండ్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు చేరుకున్నారు. సాయంత్రం 4.45 నిమిషాలకు ప్రారంభమైన ర్యాలీ మిద్దె సెంటర్‌కు 5.10 నిమిషాలకు చేరుకుంది. సాయంత్రం 5.15కు బహిరంగ సభ ప్రారంభమై 7.10కి ముగిసింది.



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాండ్రు కమల, మురుగుడు, ఎంపీ విజయసాయిరెడ్డి

గుంటూరులో ఐటీ సోదాలు

- లలితా స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు
- సాయంత్రం వరకు కొనసాగిన పరిశీలన
- వేర్వేరు చోట్ల కీలక పత్రాలు స్వాధీనం



కొత్తపేటలోని లలితా హాస్పిటల్

పాత గుంటూరు: గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన నాలుగు బ్రాంచీలతో పాటు నివాసాలు, నర్సింగ్ హాస్టళ్లలో ఢిల్లీకి చెందిన 30మందికి పైగా ప్రత్యేక ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్ ప్రాంతానికి ఉదయం 9 గంటల సమయానికి చేరుకున్నారు. సరాసరి హాస్పిటల్ లోపలికి వెళ్లి సుదీర్ఘంగా సోదాలు నిర్వహించి విలువైన పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లను పరిశీలించారు. తనిఖీలు కొనసాగినంత సేపు భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది హాస్పిటల్‌లోకి వెళ్లే రోగులను సైతం లోపలికి వెళ్లేందుకు నిరాకరించారు. లోపల జరిగే విషయాలు బయటికి రాకుండా స్థానిక అధికారుల ఫోన్‌లన్నీ స్విచ్ ఆఫ్ చేయించారు. గుంటూరులో ఓ థియేటర్, మరికొన్ని విలువైన ఆస్తులు కొనుగోళ్లతో పాటు తక్కెళ్లపాడు హైవేలో భారీ కట్టడాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. స్థానిక ఐటీ అధికారులు కూడా పాల్గొన్నారు. రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. ప్రముఖ వైద్యశాలపై ఒక్కసారిగా 30 ప్రత్యేక బృందాలు దాడులు చేయడంతో వైద్యవర్గాల్లో ఆందోళన నెలకొంది.

బలహీనవర్గాలకు పెద్దపీట



నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా అనిల్ కుమార్ యాదవ్

- ఐదో జాబితాలో ప్రకటించిన వైఎస్సార్ సీపీ
- సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా బీసీలకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్
- నెల్లూరు టౌన్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్
- అనిల్ యాదవ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట లోక్‌సభ పార్టీ సమన్వయకర్తగా పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ ప్రకటించింది. 2024 ఎన్నికల్లో అన్ని సీట్లలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రకటించిన ఐదో జాబితాలో అనిల్ కుమార్ యాదవ్‌కు చోటు లభించింది. దేశంలో మరెక్కడా లేనివిధంగా రాజకీయాల్లో బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా నరసరావుపేట లోకసభ స్థానాన్ని ఈ దఫా బీసీలకు కేటాయించాలని సీఎం నిర్ణయించారు. దీంతో యాదవ వర్గానికి చెందిన అనిల్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ఈ నిర్ణయంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ చైతన్యం కలిగిన కీలకమైన పల్నాడు లాంటి ప్రాంతంలో బలహీనవర్గాలకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఇప్పటికే బలంగా ఉన్న నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఇన్‌చార్జిగా అనిల్ యాదవ్ పేరు ప్రకటనతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొంది. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఈ దఫా బీసీలకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించడంతో ప్రస్తుతం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.



రాజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో టపాసులు కాల్చుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు...

రాజుపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా పోలుబోయిన అనీల్‌కుమార్‌యాదవ్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడంతో మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలు, నాయకులు భారీ స్థాయిలో టపాసులు పేల్చి కేరింతలు కొట్టారు.

మంత్రిగా పనిచేసిన అనుభవం...

నరసరావుపేట లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించిన పి.అనిల్ కుమార్ యాదవ్ నెల్లూరు టౌన్ అసెంబ్లీ స్థానం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి వరుసగా విజయం సాధించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలి కేబినెట్‌లో అనిల్ యాదవ్ జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. అనిల్ కుమార్ యాదవ్ చెన్నైలోని ఓ ప్రముఖ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున నెల్లూరు కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా చేశారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన అనిల్‌యాదవ్ కేవలం 90 ఓట్లతో ఓటమి చెందారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కలెక్టర్ లోతేటి శివశంకర్

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కలిసి ఆసరా చెక్కుల పంపిణీ
- జగనన్న కాలనీ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్వయం సహాయక సంఘాలకు 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 673 స్వయం సహాయక సంఘాలకు రూ.4,34,31,225లు అందజేశామన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే రూ.20లక్షల వరకు రుణపరిమితిని పెంచిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నుంచి మంత్రుల దాకా మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. వినుకొండ అభివృద్ధిలో జిల్లా కలెక్టర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. ఆడపిల్లల కోసం బంగారు తల్లి పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. శుక్ర, మంగళవారాల్లో పుట్టిన ఆడపిల్లలకు ఆసుపత్రిలోనే పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీబీటీ పథకం ద్వారా రూ.12వేల కోట్ల నిధులు ప్రభుత్వ పథకాల రూపంలో అందించినట్లు చెప్పారు. అలాగే పల్నాడు జిల్లాలో లక్షకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం జగనన్న కాలనీ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్‌లతో పాటు పలువురు అధికారులు, నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవానికి వేళాయె

- నేడు రంగుల సంబరానికి తరలనున్న తిరుపతమ్మ
- పక్కా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

పెనుగంచిప్రోలు: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే తిరుపతమ్మ వారి రంగుల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 5.54 గంటలకు ఆలయం నుంచి గోపయ్య సమేత తిరుపతమ్మ వారితో పాటు సహదేవతలను బయటకు తీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయం నుంచి విగ్రహాలను బయటకు తీసేముందు అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఆలయ అర్చకులు పాపమాంబ వంశీకులు అమ్మవారికి బోనం చెల్లిస్తారు. శాలివాహనులు కుండలో కుంభం(అన్నం) వండుకొని వస్తే రజకులు దానిని దిష్టి తీసేందుకు వినియోగిస్తారు. అనంతరం రజకులు విగ్రహాలను నెత్తిన పెట్టుకొని గ్రామంలో ఉత్సవంగా డప్పుల మోతలు, మంగళవాయిద్యాలు, పలు రకాల నృత్యాల నడుమ గ్రామంలోని రంగుల మండపం వద్దకు చేరుస్తారు. మధ్యాహ్నం తర్వాత లాటరీ ద్వారా ఎంపిక చేసిన 11 ఎడ్లబండ్లపై 11 విగ్రహాలను మక్కపేట, చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేటలోని రంగుబజారులోని రంగుల మండపానికి ఫిబ్రవరి 2 ఉదయానికి చేరుస్తారు. ఎడ్ల బండ్ల వెంట వచ్చేవారికి భోజన ఏర్పాట్లు ఆలయం వారు చేస్తున్నారు.



ముస్తాబైన దేవతామూర్తులు విడిది చేసే గ్రామంలోని రంగుల మండపం

అందరూ సహకరించాలి..

అమ్మవారి రంగుల మహోత్సవానికి అందరూ సహకరించాలని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె. రమేష్‌నాయుడు బుధవారం కోరారు. గురువారం ఉదయం 5గంటల నుంచి ఆలయంలో వైదిక పరమైన పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 5.54 గంటలకు దేవతామూర్తులను గర్భాలయం నుంచి బయటకు తీసుకు వస్తారన్నారు. మధ్యాహ్నానికి గ్రామంలోని రంగుల మండపం వద్దకు విగ్రహాలను చేర్చుతామన్నారు. రాత్రికి తంబరేణి గార్డెన్స్ లేదా రైల్వే ట్రాక్ వద్ద బండ్ల వెంట వచ్చిన భక్తులకు, పనివారికి, ఎడ్లబండ్ల యజమానులకు భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు విగ్రహాలు వత్సవాయి మండలం మక్కపేట చేరుతాయన్నారు. అక్కడి నుంచి చిల్లకల్లు మీదుగా ఫిబ్రవరి 2 ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేటలోని రంగుల మండపానికి వస్తాయన్నారు. ఉత్సవం సందర్భంగా విగ్రహాల ముందు బేతాళ వేషాలు, కోలాట నృత్యాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలపారు. ఎడ్లబండ్ల యజమానులు కరెంట్ తీగలు, లైట్లు విద్యుత్ శాఖ అధికారులు సూచించిన విధంగా ఉండాలన్నారు. బండ్లు వెంట అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ ఉంటుందన్నారు.



బాలల శ్రేయస్సుకు సమష్టి కృషి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి
- కలెక్టరేట్‌లో బాలల పరిరక్షణపై సమీక్ష

నరసరావుపేట: బాలల హక్కుల పరిరక్షణ, వారి శ్రేయస్సును కాంక్షించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రణాళికాయుతంగా అడుగులు వేయాల్సిందేనని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు, బీసీ, ట్రైబల్, వెల్ఫేర్, వసతి గృహాల వార్డెన్లు, విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ, పోలీస్ శాఖాధికారులు, రోడ్డు రవాణా సంస్థ, దేవదాయశాఖ, మండల విద్యాశాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడతారో అక్కడ ప్రత్యక్షంగా, పరోక్షంగా తనదైన శైలిలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అడుగులు వేస్తుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిని గమనిస్తూ ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తామన్నారు. హక్కుల పరిరక్షణలో రాజీలేని సేవలే ఏకైక లక్ష్యంగా పనిచేస్తామన్నారు. డ్రాపౌట్లు, రెగ్యులర్ విద్యార్థులు మీద ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. డీఆర్‌ఓ కె.వినాయకం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రారంభించిన బంగారు తల్లి కార్యక్రమం ద్వారా అత్యధిక శాతంలో ఉన్న రక్తహీనత స్థాయిని సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీఈఓ కె.శామ్యూల్ మాట్లాడుతూ స్కూళ్లలో రెగ్యులర్‌గా బడికిరాని పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పిస్తున్నామన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, ఐసీడీఎస్ పీడీ ఉమా రాణి, జీసీడీఓ రేవతి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల

క్లుప్తంగా

మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్లుగా ఇద్దరికి అవకాశం



కో ఆప్షన్ సభ్యులను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులుగా షేక్ ఎ.బాషా, బిజ్జం నాగలక్ష్మిలను ఎంపిక చేసినట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమావేశంలో వీరిని ప్రభుత్వ విప్ పీఆర్కే, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు సత్కరించి అభినందనలు తెలిపారు. అదే విధంగా రెండున్నరేళ్ళుగా కో ఆప్షన్ మెంబర్లుగా పనిచేసి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేసిన కో ఆప్షన్ మెంబర్లు ఎ.అనంతరావమ్మ, షేక్ యాసిన్‌లను సత్కరించారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా బాలిసైద్



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు(ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది షేక్ బాలిసైద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 16 సంవత్సరాలుగా సత్తెనపల్లి కోర్టులో ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. బాలిసైద్‌ను న్యాయవాదులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఇ.ఎల్లారెడ్డి, చిట్టా విజయభాస్కర్ రెడ్డి, రాజవరపు నరసింహారావు, పి.రవి, బాబూరావు, జె.విజయ్‌కుమార్, ఎన్.వేణుగోపాల్, ఏవీ కృష్ణారెడ్డి, బి.రామి రెడ్డి, కె.అనిల్, షేక్ నాగుల, నాగూర్ బాబు, జగన్‌మోహన్‌రావు, వి.పాపారావు పాల్గొన్నారు.

ఆర్డీఓ శేషిరెడ్డి కర్నూలు బదిలీ

నరసరావుపేట: రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న ఎం.శేషిరెడ్డి, కర్నూలు డెప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చీరాలలో ఆర్డీఓగా పనిచేస్తున్న ఎస్.సరోజిని రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త ఆర్డీఓల బదిలీల్లో ఈ మార్పులు, చేర్పులు జరిగాయి.

నైపుణ్యాలను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా

జిల్లా కలెక్టర్ శివశంకర్



డీఎస్ఏ స్టేడియంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

నరసరావుపేట: యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా నోడల్ అధికారి ఏ శ్యాంప్రసాద్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలు ఆడి లాంఛనంగా ప్రారంభించారు. నియోజకవర్గాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అందరూ ఉత్సాహంగా క్రీడలలో పాల్గొని విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ ఆటలను సచివాలయ, గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారన్నారు. ఆటలలో ప్రావీణ్యం ఉన్నవారు ప్రోత్సహించబడతారని చెప్పారు. ఈసందర్భంగా ఇండోర్ స్టేడియంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడాకారులతో కలసి షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. స్టేడియం గ్రౌండ్‌లో ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ క్రీడాకారులతో కలసి వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి సురేష్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీడీఓ మహాలక్ష్మి, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, పీఈటీ చప్పల్లి వెంకటేశ్వర్లు, విద్యావేత్త వద్దుల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే ఆంజనేయులు, మూరే రవీంద్రరెడ్డి, పాదిలే ఖాజా పాల్గొన్నారు.

ఎస్టీయూ భవన నిర్మాణానికి భూమిపూజ



ఎస్టీయూ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం రూ.60 లక్షల విలువైన ఐదు సెంట్ల స్థలాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నూతన భవనానికి కేటాయించిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదురుగా కేటాయించిన స్థలంలో నిర్మాణం చేసుకోనున్న ఎస్టీయు భవన నిర్మాణ భూమిపూజకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలసి హాజరయ్యారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా జిల్లాలు ఏర్పడిన అనంతరం ఎస్టీయూ భవన స్థలం కోసం జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఎస్టీయూ ఐదు సెంట్లు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. భవనం నిర్మాణం భూమిపూజ నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైందని, నిర్మాణానికి సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని సాధ్యమైనంత మేరకు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పల్నాడు జిల్లా డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, లింగంగుంట్ల గ్రామ మాజీ సర్పంచి పొన్నపాటి ఈశ్వరరెడ్డి, నాయకులు కామిరెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచు పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సత్తెనపల్లి ఆర్డీఓగా మురళీకృష్ణ



గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించారు. కమిషనర్‌గా సేవలందిస్తున్న ఆయన పదోన్నతిపై సత్తెనపల్లి ఆర్డీఓగా బదిలీ అయ్యారు. నూతన మున్సిపల్ కమిషనర్‌కు బాధ్యతలు అప్పగించిన అనంతరం ఆయన గుడివాడ నుంచి రిలీవ్ కానున్నారు.

మహిళ పై దాడికి పాల్పడిన ప్రియుడు

ముప్పాళ్ల: మహిళపై ప్రియుడు దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని రుద్రవరం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన పసుపుల స్వప్న, 12 సంవత్సరాలుగా సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెనకు చెందిన శంకర్రావుతో సత్తెనపల్లిలో సహజీవనం చేస్తోంది. సోమవారం రాత్రి శంకర్రావు, స్వప్న ఇద్దరూ కలసి ద్విచక్రవాహనంపై ముప్పాళ్ళ మండలంలోని తొండపి గ్రామానికి వెళ్లి వస్తూ డబ్బులు విషయంలో రుద్రవరం గ్రామ సమీపంలో గొడవ పడ్డారు. శంకర్రావుతో పాటుగా అతడి స్నేహితుడైన మరో వ్యక్తితో కలసి స్వప్నపై దాడి చేయటంతో ముఖంపైన గాయాలయ్యాయి. స్వప్నను పొలాల్లోనే వదిలేసి వెళ్లారు. స్వప్న తన ఫోన్ ద్వారా మరో వ్యక్తికి సమాచారం అందించటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.హజరతయ్య తెలిపారు.

పంట నమోదు సకాలంలో నిర్వహించాలి



పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

చిలకలూరిపేట: రైతులు సకాలంలో పంట నమోదు కార్యక్రమం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని పసుమర్రు, లింగంగుంట్ల గ్రామాల్లో శనగ, పొగాకు పంటలను బుధవారం వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నమోదు నిర్ణీత సమయంలో జరగాలని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన పంట నమోదును రికార్డుల వారీగా పంట పొలాలను పరిశీలించారు. పంట నమోదు వలన కలిగే ఉపయోగాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, ఇన్‌చార్జి ఏఓ హరిప్రసాద్, ఏఈవో జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దూబచెరువు సుందరీకరణతో ఆహ్లాదం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు తదితరులు

గురజాల: దూబచెరువు సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. దూబచెరువును బుధవారం ప్రారంభించారు. గురజాలలోని రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, పల్నాటి బ్రహ్మనాయుడు, జగ్జీవన్‌రావు విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సుమారుగా రూ.3 కోట్లకు పైగా నిధులు సమకూర్చి సుందరవనంగా తీర్చిదిద్దడం జరిగిందని చెప్పారు. 900 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన చెరువు గత పాలకులు పట్టించుకోలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుందరీకరణతో పాటు మంచి వాకింగ్ ట్రాక్, జిమ్, పిల్లల పార్కు వంటివి ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగరల్లోని పార్కులకు దీటుగా గురజాలలో కూడా దూబచెరువును పార్కుగా మార్చడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం గురజాలలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు పైలాన్ ఏర్పాటు చేశారు. అనంతరం సచివాలయాన్ని ప్రారంభించారు.

జిల్లా స్థాయి ప్రతిభా పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు

పెదకూరపాడు: రాంఫా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. క్విజ్, వ్యాసరచన, వకృత్వం, డ్రాయింగ్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు సత్తెనపల్లి ఉప విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు, మండల విద్యా శాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, హెచ్ఎం అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, నిర్వాహకుడు వెంకటరమణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కానుకమాత దేవాలయ తిరునాళ్లకు సిద్ధం



విద్యుత్ దీపాలతో ముస్తాబైన కానుకమాత చర్చి

- రేపు వైభవంగా వేడుకలు
- రాష్ట్రంలోనే అతి పెద్ద చర్చి

రెంటచింతల: ఆధ్యాత్మిక కొలువు రెంటచింతల. రాష్ట్రంలోని అతి పెద్ద చర్చి కానుకమాత దేవాలయం. ఆలయంలో అడుగు పెట్టగానే చలువరాయి చల్లదనమే కాదు... కానుకమాత కరుణాకటాక్షాల వీక్షణాలు కూడా ప్రసరిస్తాయి. క్రీస్తు సిలువ వేసే సమయంలో పడిన పాట్లను గుర్తుచేసే 14 స్థలాలు ఇక్కడ భక్తులలో ప్రేమ, శాంతి, కరుణ, సహనం నింపుతాయని భక్తుల నమ్మకం. రాష్ట్రంలోనే దాదాపు ఐదువేల మంది భక్తులు ఒకేసారి ప్రార్థన చేసుకునే సౌకర్యం ఉన్న అతిపెద్ద చలువరాతి క్రీస్తు దేవాలయం. 1982లో రూ.30 లక్షలతో నిర్మించారు. ఇంతపెద్ద ఆలయం కేవలం రెండు పిల్లర్ల ఆధారంగా నిర్మించడం ఇక్కడ మరో విశేషం.

విశ్వాసులు అధికమే..

రెంటచింతలలో సుమారు పలు సామాజిక వర్గాలకు చెందిన 1200 కి పైగా కుటుంబాల వారు క్రీస్తును ఆరాధిస్తున్నారు. ఆలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎప్పుడు ఆధ్యాత్మిక భావన తొణికసలాడుతూ ఉంటుంది. ఫాదర్ జోసఫ్‌గ్రాండ్ నుంచి ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి వరకు 19 మంది విచారణ గురువులు ఇక్కడ క్రీస్తుబోధనలుచేస్తూ సేవలను అందిస్తున్నారు. ప్రతి ఏటా కానుకమాత దేవాలయంలో జనవరి 24న జెండా ప్రతిష్టతో ప్రారంభమై ఫిబ్రవరి 1 వరకు నవదిన ప్రార్థనలు జరుగుతాయి. ఫిబ్రవరి 2న కానుకమాత తిరునాళ్ల మహోత్సవం కన్నులపండుగగా నిర్వహించనున్నారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి...



కానేకమాత చర్చి తిరునాళ్ల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిఅయ్యాయని విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్ధు మర్రెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి క్రైస్తవ గురువులు, మతకన్యలు గురువారం సాయంత్రానికి ఇక్కడకు చేరుకుంటారని చెప్పారు.

అక్క చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ చంద్రగిరి



ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు తదితరులు

గురజాల: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం కేంద్రం గురజాల, జంగమహేశ్వరపురంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకానికి నాలుగో విడతగా నగర పంచాయతీలోకి 321 స్వయం సహాయక సంఘాలకు గాను 3,210 మంది మహిళలకు రూ.2కోట్ల 37లక్షల 3వేల 260 అందచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతి చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వి.శేషమ్మ చలమయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ కె.అంద్రెయ్య, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కె.ప్రగతి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వి.అమరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బి ఇష్టకామిరెడ్డి, కె గిరిబాబు, కౌన్సిలర్లు కె.అనిల్‌కుమార్, డీజే నారాయణ, యెనుముల దివ్యవాణి సైదారెడ్డి పాల్గొన్నారు.

ఖోఖోలో కొండాయపాలెం ప్రతిభ



గెలుపొందిన జట్టుతో అధికారులు

ఈపూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పల్నాడు జిల్లా స్థాయిలో మహిళల ఖోఖో విభాగంలో కొండాయపాలెం సచివాలయం(బొగ్గరం) జట్టు ప్రథమ స్థానం పొందింది. ఈ సందర్భంగా విజేతలైన వారిని పంచాయతీ సెక్రటరీ జి.అనూరాధ, పీడీ ఎం.వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, తలారి పుల్లారావు, కొండాయపాలెం సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు కె.స్వాతి, వి.అఖిల

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన కె.స్వాతి, వి.అఖిల ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు బుధవారం తెలిపారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, కళాశాల అధ్యాపకులు ఆర్.బి.నాయక్, ఎం.దాస్, సీహెచ్. అరవింద్, బాజీ, కె.వంశీ అభినందించారు.

రైలు నుంచి పడి మహారాష్ట్ర వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి పడి మహారాష్ట్ర వ్యక్తి మృతి చెందిన ఘటన కొలనుకొండ బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండ వంతెన కింద పట్టాల వెంబడి మృతదేహం పడి ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డులో మహారాష్ట్రలోని పుణే జిల్లా హవేలీ తాలూకా చిక్కలి గ్రామానికి చెందిన అసదుల్ హకీ లస్కర్(24) అని ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేంజ్ పరిధిలో పలువురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.దేవప్రభాకర్, లాలాపేట పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను పొన్నూరు టౌన్ పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లును తెనాలి రూరల్ సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.కె.సుభానిని తుళ్లూరు -1 పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.సురేష్‌ను మాచర్ల రూరల్ సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.రమేష్‌ను చిలకలూరిపేట టౌన్ పీఎస్‌కు, సీసీఎస్ నెల్లూరులో ఉన్న బి.రమేష్‌బాబును నరసరావుపేట ట్రాఫిక్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.సుబ్బనాయుడు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీసెల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్.ఎల్.ఎస్.శ్రీనివాస్‌ను చుండూరు సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్. సింగయ్యను బాపట్ల డీటీసీ, డీటీఆర్‌బీకు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్.హజరయ్యను బాపట్ల దిశకు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.సుబ్బారావును త్రిపురాంతకం సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న దాసరి ప్రసాద్‌ను గిద్దలూరు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

పట్టాభిపురం పోలీసు స్టేషన్ సీఐ పి.వీరేంద్రబాబును ఫిరంగిపురం పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.విజయచంద్రను పట్టాభిపురం పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న జె.రామకోటయ్యను ప్రకాశం జిల్లా కంభం సర్కిల్‌కు, కంభం సర్కిల్‌లో ఎం.రాజేష్‌కుమార్‌ను సత్తెనపల్లి రూరల్ పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న వై.శ్రీహరిని బాపట్ల రూరల్ పీఎస్‌కు బదిలీ చేశారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

మూడు రోజుల పాటు అలరించనున్న జాతీయ స్థాయి వేడుకలు



సన్నాహక కార్యక్రమాల్లో నిమగ్నమైన విద్యార్థులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. మహోత్సవ్ కార్యక్రమాన్ని గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిలుగా చిందు యక్షజ్ఞానం ఆర్టిస్ట్ గద్దం సామయ్య, ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె హాజరవుతారని తెలిపారు. 3వ తేదీ ముగింపు కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 50వేల మంది విద్యార్థులు తరలి రానున్నారని ఆయన వెల్లడించారు. విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది మొట్టమొదటసారిగా క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించామని తెలిపారు.

సినీ తారల సందడి

మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహోత్సవ్‌లో సినీ తారలు సందడి చేయనున్నారు. 3న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం, ఇండియన్ స్క్రీన్ రైటర్ బుర్రా సాయి మాధవ్ విచ్చేయనున్నారు. ఈ నెల 16న విడుదల కాబోతున్న "సుందరం మాస్టర్" సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో హర్ష చెముడు, హీరోయిన్ దివ్య శ్రీపాద 2న సందడి చేయనున్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 75 ఈవెంట్లను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయి. కల్చరల్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్, మ్యూజిక్, డ్యాన్స్, స్పాట్‌లైట్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయి. అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.